www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



నగరాభివృద్ధి ఎక్కడ? : టిడిపి

కడప అర్బన్ : కడప అభివృద్ధికి రూ.2,150 కోట్లు ఎక్కడ ఖర్చు చేశామని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా చెప్పాలని, అసలు నగరంలో అభివృద్ధి ఎక్కడ చేశారో తెలియజేయాలని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'దినదానికి అన్నం మెతుకులు లేవు అంటే మీసాలకు సంపంగి నూనె కావాలన్న' చందాన డిప్యూటీ సీఎం అంజాద్ బాషా వ్యవహార శైలి ఉందన్నారు. నగరంలో అభివృద్ధి పేరిట రోడ్లన్నీ తవ్వేశారని చెప్పారు. ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కడప ప్రజలు తెలిసీతెలిసి వర్షాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైసిపి నేతలు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అంజాద్ బాషా తమ్ముడు అహ్మద్, అల్లుడు ఉమర్ సెటిల్మెంట్లు అంతా, ఇంత కాదని విమర్శించారు. ప్రజల ఉసురు కట్టుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు అంజాద్ బాషాకు బై బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ముంచిన 'మిచౌంగ్'


పోరుమామిళ్లలో నేలకొరిగిన వరి


చాపాడులో నీట మునిగిన ఉల్లి పంట

- 17,638 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 5,254 ఎకరాల్లో నేలకొరిగిన ఉద్యానం
- నీట మునిగిన వరి, అరటి, మినుము పంటలు
- రైల్వేకోడూరులో గరిష్టంగా 355 మి.మీ. వర్షపాతం

ఉమ్మడి జిల్లాలో మిచౌంగ్ తుపాన్ బీభత్సం సృష్టించింది. కడప, అన్నమయ్య జిల్లాల్లో వేలాది ఎకరాలకు అపార నష్టాన్ని కలిగించింది. నీట మునిగిన వ్యవసాయ పంటలు, నేలకొరిగిన ఉద్యాన పంటలు, ఉధృత రూపం దాల్చిన వాగులు, వంకల ధాటికి రైతాంగంలో నిర్వేదం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాల్లోని పదుల సంఖ్యలో చెరువులకు భారీగా వరద నీరు చేరింది. రైల్వేకోడూరులో 355 మి.మీ, కడప జిల్లాలోని ఒంటిమిట్టలో 142 మి.మీ గరిష్టంగా వర్షపాతం నమోదైంది. తుపాన్ ధాటికి వ్యవసాయం, ట్రాన్స్‌కో, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో 17,638 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మూడు రోజుల కిందట పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాన్ సోమ, మంగళవారాల్లో జిల్లాపై ప్రభావాన్ని చూపించింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కడప జిల్లాలో 12,384 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 1101 ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని 36 మండలాల్లో 28 మండలాల్లో పెనునష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలపై పంజా విసిరింది. ఏడు మండలాల పరిధిలోని 171 మంది రైతులు సాగు చేసిన వరి, మినుములు, జొన్న, మొక్కజొన్న, అరటి, మిరప, టొబాకో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అత్యధికంగా 8,939 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల విస్తీర్ణంలోని 9,687 ఎకరాల్లో వరి, మినుములు, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, మస్క్ మెలన్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా1,815 ఎకరాల్లో మినుములు, 293 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాజంపేట, నందలూరు, మండలాల పరిధిలోని 20గ్రామాల పరిధిలోని 358 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో సూగర్‌కేన్, పంటలకు నష్టం వాటిల్లింది.

నేలకొరిగిన ఉద్యానం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,254 ఎకరాల్లో ఉద్యాన పంటలు నేలకొరిగాయి. తుపాన్ తీవ్రతతోపాటు గాలుల బీభత్సం ధాటికి పండ్లతోటలు నేల కొరగడం ఆందోళన కలిగించింది. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, చింతకొమ్మదిన్నె, సిద్ధవటం, కాశినాయన, మైదుకూరు, బి.మఠం, బద్వేల్, ఖాజీపేట, అట్లూరు మండలాల్లోని 524 మంది రైతులకు సంబంధించి 1,101 ఎకరాల్లో పండ్లతోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 899 ఎకరాల్లో అరటి రైతులే కావడం గమనార్హం. బొప్పాయి, నిమ్మ, వంగ, మిరప, టమోటా కర్బూజ, ఉల్లి, తదితర పంటలు ఉన్నాయి. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలో 4, 153 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం రాజంపేట, చిట్వేలి, కోడూరు, ఓబులవారిలిపల్లి, పెనగలూరు పుల్లంపేట, రామాపురం మండలాల్లో పరిధిలోని 79 గ్రామాల్లోని రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అత్యధికంగా 398 ఎకరాల్లో అరటి, 87 ఎకరాల్లో బొప్పాయి, 93 ఎకరాల్లో బీటల్‌వైన్ పంటలు నష్టపోయాయి. ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేయడం గమనార్హం.

నేలకొరిగిన వరి, బొప్పాయి, అరటి పంటలు
ఆందోళనలో రైతన్నలు

చాపాడు : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాన్ రూపంలో వర్షం రావడంతో పంటలు నేలకొరుగుతున్నాయి. మండల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి, ఈదురు గాలులకు వరి పంట చాలా వరకు దెబ్బతింది. మండల వ్యాప్తంగా కెసి, కుందూ, పెన్నా పరిధిలో 4 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. పెన్నా, కుందూ పరివాహక గ్రామాలలో సాగు చేసిన వరి పంట వెయ్యి ఎకరాల వరకు నూర్పిడి చేశారు. నూర్పిడి చేసిన వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమైయ్యారు. రోడ్లు, సురక్షిత ప్రాంతంలో ప్లాస్టిక్ పట్టలు కప్పి వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయ్యవారిపల్లి, తిమ్మాయిపల్లి, రాజువారి పేట, పల్లవోలు, సీతారామపురం, కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, వెదురూరు గ్రామాల పరిధిలో వరి పంట నూర్పిడి దశలో ఉంది. ఖాదర్‌పల్లె, సోమాపురం, అయ్యవారిపల్లి, రామదాసుపురం, తిమ్మాయిపల్లి గ్రామాల వద్ద వరి పంట అధికంగా నేలకొరిగింది. వరి ధాన్యం వర్షపునీటిలో తడిస్తే మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. 3 వేల ఎకరాలలో పంట నూర్పిడి దశలో ఉంది. పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో దెబ్బ తింటుంటే ఏమీ చేయలేని పరిస్థితులలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వర్షంలోనే వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి పనులు చేపడుతున్నారు. ఎకరా సాగుకు రూ.30 వేల వరకు ఖర్చులు అయ్యాయని ప్రస్తుతం వర్షానికి ధాన్యం దిగుబడి తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. వర్షం తగ్గుముఖం పట్టకపోతే పంట పూర్తిగా దెబ్బతింటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తున్న సమయంలో వర్షాలతో పంట దెబ్బతినడంతో నష్టాలు తప్పవని వాపోయారు. రెండు సంవత్సరాల కితం అధిక వర్షాలతో వరి రైతులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగు చాలా వరకు తగింది. ఈ పరిస్థులలో కూడా చేతికి వచ్చిన దశలో వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు ఆర్‌బికెల పరిధిలో ఉన్న తమ సిబ్బంది దెబ్బతింటున్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలు నమోదుకు అవకాశం ఇచ్చి నష్ట పరిహారం అందివ్వాల్సిన అవసరం ఉంది.

మైదుకూరులో.. మండలంలోని వేపరాలపల్లిలో తుపాన్ కారణంగా భారీ వర్షంతో సుమారు 50 ఎకరాలలో వరి, 30 ఎకరాలు కొత్తిమీర ,100 ఎకరాలు మినుము పంటలు దెబ్బతిన్నాయని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాన్ని సందర్శించి పంట నష్టం నివేదిక ను ప్రభుత్వానికి తెలియపరచాలని కోరుతున్నారు. తుఫాన్ తాకిడితో ఈదురు గాలులు అధికమవడంతో పంటలు దెబ్బతిన్నాయి.


దువ్వూరులో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు

ఒంటిమిట్ట : తుపాను కారణంగా మండలంలో బలమైన గాలులు వీచడంతో బొప్పాయి, టేకు చెట్లు నేలకొరిగాయి. మండలంలోని చింతరాజుపల్లిలో గాలివాన బీభత్సవానికి జంగాల వీరభద్రయ్యకు చెందిన 8 ఎకరాల బొప్పాయి చెట్లు విరిగి పడ్డారు. దీంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. అదే గ్రామంలో బొప్పాయితోపాటు మామిడి చెట్లు పడిపోయాయి. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నష్ట పోయారు. సంబంధిత వ్యవసాయ అధికారులు న్యాయం చేయాలని కోరారు. కొన్ని నెలలుగా కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో నేలపాలు కావడంతో రైతులు కన్నీరు పర్యంతమయ్యారు. వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీచడంతో అపార నష్టం వాటిల్లింది. మండల పరిధిలో 1266 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల అరటి తోటను మన్నేరు చెంచయ్య అనే రైతు సాగు చేశాడు. రెండు రోజులుగా కురుస్తున్న తుపాను కారణంగా ఒక నెలలో చేతికి వస్తుందన్న అరటి పంట పూర్తిగా నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం ఉదయం తోటలో పరిశీలించడానికి వెళ్లగా 200 చెట్లకు పైగానేల పాలయ్యాయని, దీంతో రూ. ఒకటిన్నర లక్ష నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటివరకు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేశామని, ప్రస్తుతం చెట్లు పడిపోవడంతో ఏమి చేయాలో తెలియడం లేదని వాపోయాడు. పంట చేతికి వస్తుందన్న తరుణంలో అరటి చెట్లు నేలపాలు కావడం తాము జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పాడు. సంబంధిత వ్యవసాయ అధికారులు స్పందించి తమ పంట నష్టమును పరిశీలిం ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరారు.

పోరుమామిళ్ల : తుపాను కారణంగా మండలంలోని వరి రైతులు బిక్కు బిక్కు మంటున్నారు. అనావృష్టిని తట్టుకొని వరి పంట వేస్తే తుపాన్ తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఇంటికి వచ్చే సమయంలో తుపాను రైతులను ముంచింది. తుఫాన్ కారణంగా వీచిన గాలులకు ఆయా గ్రామాల్లో పండిన పంట నేలమట్టమైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి తడిసి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటి వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న పంట తుపాన్ కారణంగా నష్టం వాటిల్లిందని ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి పంట పండించారు. తెగుళ్ళ బారి నుండి వరి పైరును కాపాడుకుంటూ వచ్చారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కోత కోసిన వరి పనలు పూర్తిగా ఎండకుండానే రైతులు హడావుడిగా కుప్పలు వేశారు. దీని వల్ల పంట నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. . మండలంలో మంగళవారం సాయంత్రం నాటికి ప్రాథమిక అంచనా ప్రకారం 149 ఎకరాల వరి పంట, 26 ఎకరాల మొక్కజొన్న తుపాను కారణంగా నష్టం. వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారి వరహరి కుమార్ పేర్కొన్నారు.

నేలకొరిగిన వరి పంట

దువ్వూరు : సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని దాసరి పల్లె, నీలాపురం, మాచవరంపల్లె గ్రామాల్లో కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు మండలంలో 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలో దాదాపు 40 హెక్టార్లలో పైగా వరి పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పంట నష్టం అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు.

కూలిన మట్టిగోడ..నిండు గర్భిణీకి తప్పిన ముప్పు

అట్లూరు మండలంలోని వలస పాలె లో తుపాను కారణంగా నేలమట్టమైన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నిండు గర్భిణి ప్రసన్న త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకంది. ఆ ఇంట్లో ఆమెతోపాటు తల్లి లక్ష్మీదేవి మాత్రమే నివాసముంటున్నారు. ప్రసన్న కాన్పు కోసం అమ్మగారింటికి ఇటీవల వచ్చింది. నివాసం ఉన్న ఇంటి గోడ కొద్దిగా వరగడంతో అప్రమత్తమై బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి గోడ పడిపోయింది. మండలంలో తుపాను బీభ్సతానికి వరి పంటకు అధిక నష్టం వాటిల్లింది. దోస చెట్లలోకి నీరు చేరి పంట మొత్తం మునిగింది.

రోడ్లు జలమయం

కడప అర్బన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నగరంలోని రోడ్లని జలమయమయ్యాయి. ముఖ్యంగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసినప్రతిసారీ ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడప మామిళ్ళ పల్లి లోని 'సెవెంతే– డే అడ్వంటిస్ట్' పాఠశాల రేకులు బలంగా వీచిన ఈదురు గాలులకు లేచిపోయ్యాయి. చెట్లు నేలకొరిగాయి. పాఠశాలకు సెలవు కావడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.


అట్లూరు : కూలిన ఇంటి గోడ చూపుతున్న బాధితురాలు


జలమయమైన కడప నగర రోడ్డు

'జనన మరణ నమోదు బాధ్యతగా చేపట్టాలి'


మాట్లాడుతున్న డైరెక్టర్ బాలకిరణ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఆరోగ్య కేంద్రంలో జనన, మరణ నమోదు ప్రక్రియను విధిగా, బాధ్యతగా చేపట్టాలని ఎపి, తెలంగాణ ఉభయ రాష్ట్రాల జనన మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి.బాల కిరణ్ వైద్యాధికారులను సూచించారు. మంగళవారం రిమ్స్ మెడికల్ కళాశాలలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) అమలు, నిర్వహణపై జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర జనన మరణ గణాంకాల శాఖ డైరెక్టర్‌తోపాటు పి.బాల కిరణ్, కడప నగర కమిషనర్, రిమ్స్ ప్రత్యేకాధికారి జిఎస్ఎస్ ప్రవీణ్ చంద్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు హాజరయ్యారు. గణాంకాల శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ యూనిట్లను కలిగిన ఆరోగ్య కేంద్రాల్లో జనన మరణ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉయస్త వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనన మరణాల రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మూడు అంచెల ఉద్దేశాలున్నాయని చెప్పారు. కడప నగర కమిషనర్ మాట్లాడుతూ జిల్లా జనాభా 22,13,911 కాగా జిల్లాలోని 36 మండలాలలో మొత్తం 618 జనన, మరణ నమోదు యూనిట్లు ఉన్నాయన్నారు. అందులో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 62 కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 8, గ్రామ పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 548 రిజిస్ట్రేషన్ యూనిట్లు ఉన్నాయని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో చూస్తే కడప నగరంలోని 49 సిఆర్ఎస్ రిజిస్ట్రేషన్ యూనిట్లు, ప్రొద్దుటూరులో 40 ఉన్నాయన్నారు. రిమ్స్ జిజిహెచ్ సూపరింటెండెంట్ కడప జిజిహెచ్‌లో 2016 మే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) ప్రారంభమైందని అప్పటి నుంచి 2023 నవంబర్ వరకు 62,831 జననాలు, 14,356 మరణాలు నమోదయ్యాయన్నారు. వివిధ ద్వారా రిమ్స్ జిజిహెచ్ పరిధిలో అమలవుతున్న జనన, మరణ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు. జనన మరణాల రికార్డులు మే, 2016 నుంచి ఇప్పటి వరకు అన్నింటిని నెల వారీగా కంప్యూటరైజ్డ్, బైండింగ్ చేసి భద్రపరుస్తున్నామని డైరెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. సురేఖ, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డా. సురేశ్వర్ రెడ్డి, అన్ని విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : కలెక్టర్

కడప అర్బన్ : జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు డిఐఇపిసి సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జెసి గణేష్ కుమార్, కడప నగరపాలక కమిషనర్ ప్రవీణ్ చంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలని సూచించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకునే వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపణపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్/ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ డిపార్ట్మెంట్ కృష్ణ మూర్తి, ఐపిఒ లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ ధర్మారావు, ఎపిఐఐసి ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వాణిజ్య పన్నుల శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కాశినాయన : మండల కేంద్రమైన నర్సాపురంలోని సగిలేటి ఒడ్డున ఉన్న వివేకానంద అనాథాశ్రమంలో గంగనపల్లె పంచాయతీ సర్పంచ్ బసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పల్లి అంకమ్మ 21 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లి జ్ఞాపకార్ధంగా అనాథాశ్రమంలో అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి సతీమణి నాగమణి చెల్లెలు ప్రభావతి పాల్గొన్నారు

నేడు కాశినాయన మండల సమావేశం

కాశినాయన : మండలానికి సంబంధించి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ సభాభవంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మైథిలి ఒక ప్రకటనలో తెలిపారు. ండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరై ఆయా పంచాయతీల సమస్యల గురించి చర్చించాలన్నారు. బినామీ ఎంపిటిసిలకు ప్రవేశం లేదని తెలిపారు.

సేవాశ్రమానికి ఫ్రిజ్ వితరణ

ప్రజాశక్తి - కడప

నిర్మల జనరల్ హాస్పిటల్– దీర్ఘకాలిక రోగుల సేవాశ్రమానికి కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.మురళీమోహన్ చేతుల మీదుగా రిఫ్రిజిరేటర్‌ను బహుకరించారు. కెనరా బ్యాంకు 118వ ఆవిర్భావదినం పురస్కరించుకొని మంగళవారం నిర్మల హాస్పిటల్– దీర్ఘకాలిక రోగుల సేవాశ్రయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు ఆర్ఎం సేవాశ్రయానికి వితంఇగా రిఫ్రిజిరేటర్‌ను బహుకరించారు. కార్యక్ర మంలో డివిజనల్ మేనేజర్ ఏ.వి.రాజశేఖర్, కడప మెయిన్ బ్రాంచ్–2 చీఫ్ మేనేజర్ ఎం.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'మినుగురులు' పుస్తకావిష్కరణ

కడప అర్బన్ : మినుగురులు పుస్తకావిష్కరణ సభ బుధవారం సాహితీకారులు, సాహిత్య పాఠకులు తరలిరావాలని అంబేద్కర్ మిషన్ వ్యవస్థాపక సభ్యులు ప్రసాద్ బండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుస్తక రచయిత ప్రొఫెసర్ చర్లపల్లి స్వరూప రాణి హాజరవుతారని తెలిపారు. పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ సి ఓబుల్ రెడ్డి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎం. వినోదిని సభ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

పంటల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి

కడప సిటీ : మిచౌంగ్ తుపాన్ ధాటికి నేలకొరిగిన పంటల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు మంగళవారం కడప మండలంలోని పాలెంలెం పల్లె గ్రామాల్లో తుపాను వల్ల నేలకు ఒరిగిన వరి పంటను పరిశీలించారు. వరి పొలంలో నీరు నిలవకుండా గట్లు తెంచుకోవాలని సూచించారు. నేలకొరిగిన వరిని ఓదెలుగా కట్టుకోవాలని తెలియజేశారు. వర్షం తగ్గిన వెంటనే ఐదు శాతం ఉప్పు ద్రావణం ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే గింజలు నలుపు రంగుకు మారకుండా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కడప ఏడిఏ డి.వి. సుబ్బారావు ,మండల మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ రెడ్డి, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

కడప : ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గృహ, నీటి అవసరాలకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్దిస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో మంగళవారం ఆయన వైస్ఆర్ జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. తెగిపడిన విద్యుత్ లైను తెగపడితే సంబంధిత సిబ్బందికి కానీ, అధికారులకు కానీ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి : డిసిసి

కడప : కడప పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి నూతనంగా నియమింపబడిన ఆయా మండల అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి, విజయానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు కడప పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి మండలాల వారీగా అధ్యక్షులను నియమించినట్లు చెప్పారు. బద్వేల్, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల్లోన ఆయా మండలాలకు నూతన అధ్యక్షులను నియమించామని చెప్పారు. వీరందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి, 2024లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజ యానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రితమ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు చిన్న కులాయప్ప పాల్గొన్నారు.

నేల-నీరుపై చర్చా గోష్టి

చింతకొమ్మదిన్నె : నేల–నీరు సమస్త జీవకోటికి మూలమని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా, శాస్త్రవేత్తలు డీలర్లు, రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి హాజరై మాట్లాడుతూ పచ్చిరొట్టె పంటల సాగు, కంపోస్ట్ వినియోగంలో జిల్లా అన్ని జిల్లాల కంటే ముందుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సైంటిస్ట్ జాన్సన్ మాట్లాడుతూ నేల సంరక్షణకై పురుగు, తెగుళ్ల మందులను విచక్షణ రహితంగా వాడకుండా ఉండాలని సూచించారు, డిపిడి పద్మలత మాట్లాడుతూ భూమిలోని కర్బన శాతాన్ని పెంపొందించుకోవడానికి చెక్క, ఎఫ్ఐఎం వంటి వాటిని కచ్చితంగా వాడాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌చారి, కడప ఎడిఎ సుబ్బారావు, డీలర్లు, రైతులు, కెవికె డాట్ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్‌ను పరామర్శించిన అఫ్జల్‌ఖాన్

కడప : కడప నగరం లోని రూకవారి పల్లెలో మహిళా నాయకురాలు మౌలాని కుమారుడు అబ్దుల్ ఇటీవల వాలీబాల్ ఆడుతూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడరు. ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. అబ్దుల్‌ను మంగళవారం కడప అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ గారు వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి జెఎసి అమరావతి అనుబంధంగా పనిచేస్తున్న కాంటాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న విజయవాడ జింఖానా గ్రౌండ్స్ గాంధీ నగర్‌లో ప్రపథమ మహాసభకు ఉద్యోగులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా వైస్ చైర్మన్ పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రీ కృష్ణ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప రెవెన్యూ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో శాఖలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని ఏకం చేసి ఒక సంఘంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. 26 జిల్లాల్లో జిల్లా కమిటీలను పూర్తి చేసి ఈనెల 10న రాష్ట్ర కమిటీ ఎన్నిక జరుగుతున్న కారణంగా అదేరోజు మహాసభ వేదిక ద్వారా ప్రభుత్వానికి సమస్యలు విన్నవించునున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ ఏజెన్సీల దోపిడీకి బలి పశువులైన ఉద్యోగులను వారి నుంచి విముక్తి కల్గించాలని చెప్పారు. ఆప్కాస్ ఏర్పాటు అయినప్పటికీ ఉద్యోగుల శ్రమకు తగిన వేతనం లేదని చెప్పారు. పైగా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర రాయితీలు నిలిపివేశారని తెలిపారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరూ యూనిటీగా ముందుకు సాగి ప్రభుత్వానికి చిరు ఉద్యోగుల ఐక్యతను చాటాలన్నారు. అన్ని శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి జిల్లాల వారీగా అసోసియేషన్‌గా ఏర్పడడం ఐక్యతకు ఒక చిహ్నమని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి'

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్గ్రేడ్ చేయాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మిరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ డిమాండ్ చేశారు. కడప మున్సిపల్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022, జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు, మున్సిపల్ యాజమాన్యం నుంచి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయని పేర్కొన్నారు. యుటిఎఫ్ చేసినటువంటి ప్రత్యేక కృషి వల్ల కేడర్ స్ట్రెంత్ సమస్యలు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. నిరంతర ప్రాతినిధ్యాలతో మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలు, జీతాలు, మ్యాపింగ్ సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అయినప్పటికీ మౌలికమైన సమస్యలు కొన్ని ఇప్పటికీ పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రభుత్వ, పంచాయితీరాజ్ పాఠశాలల మాదిరి మున్సిపల్ టీచర్ల పోస్టులను కూడా సబ్జెక్టు టీచర్లుగా అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాల్సి ఉన్నప్పటికీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిటిలుగా కొనసాగుతున్నారని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగినందున, సబ్జెక్టు టీచర్ల కొరత తగ్గించడానికి వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరి, నాయకులు జి.వెంకట సుబ్బయ్య, శివకుమార్ రాజు, శివశంకర్, కిరణ్ శ్రీనివాసులు అనిల్ కుమార్ కుమార్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంపిపి, ఎఒ

దెబ్బతిన్న ప్రతి ఎకరాను గుర్తిస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు

మిచౌంగ్ తుపాను దాటికి దెబ్బతిన్న ప్రతి ఎకరాను వ్యవసాయ అధికారులు గుర్తిస్తారని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండలంలోని కేతవరం రెవెన్యూ పొలంలో దెబ్బతిన్న వరి పంటలను మంగళవారం ఎంపిపి, వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత రైతులతో మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని, దెబ్బతిన్న ప్రతి ఎకరాను వ్యవసాయ సిబ్బంది గుర్తిస్తారన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. వెంటనే సిబ్బందితో సర్వే చేయించాలని ఎఒ మ్యాగీకి సూచించారు. అనంతరం మైదుకూరు వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణ మూర్తి దెబ్బతిన్న పంటలను పరిశీలించి వెంటనే సర్వే చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. 1400 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. తహశీల్దార్ యామిని, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లెలో 43.6 మి.మీ. వర్షపాతం

ప్రజాశక్తి - వేంపల్లె

తుపాన్ కారణంగా రెండు రోజుల నుండి కురిసిన వర్షాలకు వేంపల్లె మండలం వ్యాప్తంగా 43.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను మంగళవారం ఆయన తన సిబ్బందితో పరిశీలించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం కురిసిన వర్షం కొన్ని పంటలకు మేలు కలిగించిందని తెలిపారు. రబీ పంటలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని రైతులను కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : అర్బన్ సిఐ రాజు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తుపాను ప్రభావం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సిఐ రాజు సూచించారు. మండలములోని నీటి ప్రవాహ ప్రాంతాలను మంగళవారం ఆయన నామాల గుండు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు సూచనలు చేశారు. అత్యవసరమైతేనే ప్రయాణించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ప్రవహించు వీలుండే వస్తువులను ముట్టుకోవద్దన్నారు. పాత మిద్దెలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పులివెందుల పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సిఐ సెల్ నెం.91121 100544, యస్ఐలు సెల్‌నెం.91211 00546, 91211 00547కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కలిగిన మేలును వారికి వివరించాలని ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్ద జొన్నవరం సచివాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి నాయకులు, గృహసారథులు, సచివాలయ, సిబ్బంది, వాలంటీర్లు అందరూ కలిసి ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించాలన్నారు.

ప్రజల ఆదరణ మరువలేనిది : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజాసేవ కోసం తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ మరువలేనిదని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. తాను ఎక్కడికె వెళ్లినా పిల్లలు సైతం జై భూపేష్ అంటున్నారని, ఇది రెట్టింపు ఉత్సాహాన్నిస్తోందన్నారు. ఆ మేరకు ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం తల్లికి వందనం పథకంలో భాగంగా ప్రతి విద్యార్థికి రూ.15వేలు ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తామన్నారు.

'ఎవరికైనా చెప్పకోండి.. నన్నేమి చేయలేరు'

ప్రజాశక్తి - కొండాపురం

ఎవరికైనా చెప్పుకోండి.. నన్ను ఏమి చేయలేరు.. అందరికీ మామూళ్లు ఇస్తున్నాం అంటూ రెచ్చిపోతున్న రేషన్ పంపిణీ డీలర్ విషయం వెలుగు చూసింది. కొండాపురం పట్టణానికి చెందిన 12వ షాప్ నెంబర్ డీలర్ ఆరు నెలలుగా ప్రభుత్వ రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి నెల 3వతేదీకే రేషన్ లేవని చెబుతున్నారని, తమకు రావలసిన కోటా బియ్యం ఎందుకు ఇవ్వరని ప్రజలు నిలదీస్తే అలా మాట్లాడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సదరు డీలరుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటున్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకొని, సక్రమంగా రేషన్ పంపిణీకి తగిన డీలర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

దువ్వూరుకు చేరిన అక్షింతలు

ప్రజాశక్తి- దువ్వూరు

అయోధ్య నుండి శ్రీరామ పాదపూజ అక్షింతలు మంగళవారం దువ్వూరుకు చేరుకున్నాయి. మండలంలోని అన్ని రామాలయాలకు ఆక్షింతలను చేరుస్తున్నామని స్థానిక రామాలయ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

క్రైం కార్నర్

రైలు ఢీ కొని నంద్యాల జిల్లా వాసి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు



బలరాముడు (ఫైల్‌ఫొటో)

రైలు కోసం రైల్వేస్టేషన్‌కు పట్టాలపై నడుచుకుంటూ వెళుతున్న ముత్తూరి బలరాముడు (53) ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతి చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడిది నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం రెడ్డివారి జంబాలదిన్నె గ్రామం. బలరాముడు కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట స్టీల్ ప్లాంటులో పని చేస్తున్నాడు. అక్కడికి వెళ్లేందుకు మంగళవారం జమ్మలమడుగు నుండి బస్సులో ముద్దనూరుకు రాగానే రైల్వే గేటు పడింది. బస్సు దిగి పట్టాలపై నడుచుకుంటూ రైల్వేస్టేషన్‌కు చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని వెళుతుండడంతో వెనుక వస్తున్న రైలును గమనించలేదు. ముంబై నుండి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొంది. ప్రమాదంలో బలరాముడు అక్కడికక్కడే మతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రారాజు తెలిపారు.

సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి మరొకరు..

ముద్దనూరు-జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని ఘాట్‌రోడ్డులో మంగళవారం సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ షణ్ముగం (41) దుర్మరణం చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..తమిళనాడు రాష్ట్రం పుడుక్కొట్టయి జిల్లాకు చెందిన షణ్ముగం ఎర్రగుంట్లకు చెందిన లారీ ట్రాన్స్ పోర్టులో డ్రైవరుగా పని చేస్తున్నాడు. మైలవరం మండలం దాల్మియా సిమెంట్ కర్మాగారం నుండి ట్యాంకర్ సిమెంట్ లోడుతో బెంగళూరుకు వెళుతుండగా ఈప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అద్దె భవనాల్లో సచివాలయాలు

పలుచోట్ల అసంపూర్తి నిర్మాణాలు - కనీస సదుపాయాల్లేక సిబ్బంది అవస్థలు



అద్దె భవనంలో కొనసాగుతున్న చిలమకూరు సచివాలయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జగన్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దాదాపు రూ.40లక్షలు ఒక్కో సచివాలయం నూతన భవన నిర్మాణానికి కేటాయించింది. అయితే నాలుగున్నరేళ్లు దాటినా చాలా భవనాలు పూర్తికాలేదు. ఈ పరిస్థితుల్లో సచివాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అక్కడ సిబ్బందికి సరైన వసతుల్లేక వారు ఇబ్బంది పడుతున్నారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీలో మొత్తం తొమ్మిది సచివాలయాలు ఉండగా అందులో ఒక్కదానికి మాత్రమే ప్రభుత్వ భవనాన్ని కేటాయించారు. మిగిలిన ఎనిమిది సచివాలయాలు అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. రూరల్ పరిధిలో మొత్తం 14 సచివాలయాలు ఉండగా అయిదుకు మాత్రమే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 9 సచివాలయాల నిర్మాణాలు పూర్తికాలేదు. నగర పంచాయతీ పరిధిలోని తొమ్మిది సచివాలయాలకు సంబంధించి 73 మంది సచివాలయం ఉద్యోగులు, 182 మంది వాలంటీర్లు ఉన్నారు. రూరల్ పరిధిలోని 14 సచివాలయాలకు సంబంధించి 132 మంది సచివాలయ ఉద్యోగులు, 207 మంది వాలంటీర్లు ఉన్నారు. చాలా సచివాలయాలు అద్దె భవనాల్లో ఉండడంతో ఇరుకైన భవనాలు, ఫర్నిచర్ కొరత, మహిళా ఉద్యోగులకు కనీసం వాష్‌రూములు కూడా లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ పరిధిలో రెండు సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో సచివాలయానికి మూడు నుండి ఐదువేల రూపాయలు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. అలాగే నగర పంచాయతీలో ఎనిమిది సచివాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్కో సచివాలయానికి నెలకు ఏడు నుండి ఎనిమిది వేల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుండి బిల్లులు రాక పోవడంతో సరైన సమయంలో అద్దె చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అద్దె భవనాల్లో, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న గ్రామ సచి వాలయాల్లో సరైన మౌలిక వసతులు లేక సిబ్బంది, పంచాయతీ కార్య దర్శులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో పంచాయతీ భవనాన్ని సచివాలయానికి ఇవ్వడంతో సచివాలయంలోనే ఒక గదిని గ్రామ సర్పంచ్‌కు కేటాయించారు. అందులోనే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఇక నగర పంచాయతీ విషయానికొస్తే సచివాలయాలకు పక్కా భవనాలకు సంబంధించి ప్రభుత్వం నుండి ఎలాంటి ఊసే లేదు. ఒకవేళ రాబోవు కాలంలో ప్రభుత్వం సచివాలయ భవనాలు నిర్మాణం చేపట్టదలచిన ఎర్రగుంట్ల నగర పంచాయతీలో ఒకటి, రెండు మినహా ప్రభుత్వ స్థలాలు లేవు. ప్రభుత్వం ఇక్కడ స్థలం కొనుగోలు చేసి మరీ నిర్మించాల్సిన పరిస్థితి. నగర పంచాయతీ పరిధిలో ఉన్న కాస్త స్థలాన్ని కూడా ప్రజాప్రతినిధుల అండదండలతో ఆక్రమించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నా నగర పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో నగర పంచాయతీ స్థలం అవసరమైతే ఏమి చేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు కానీ, కౌన్సిల్ సభ్యులు కానీ ముందుచూపుతో వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

జనవరిలోగా భవనాలు పూర్తి చేస్తాం..



మండలంలోని 14 సచివాలయాలకు ఐదు భవనాలు పూర్తయ్యాయి. ఇందులో కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయి. మిగిలిన 9లో ఏడు సచి వాలయాలు కూడా వివిధ దశల్లో పనులు జరు గుతున్నాయి. వాటికి సంబంధించి 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా ఆర్‌సి దశలో ఉన్నాయి. జనవరిలోగా అన్ని సచివాలయాల పనులు పూర్తి చేస్తాం.

- రంతుల్లయ్య, ఇఒపిఆర్‌డి, ఎర్రగుంట్ల

'టెక్స్‌టైల్ పార్కుకు మోక్షమెప్పుడో..?'



మాట్లాడుతున్న వీరనాల శివనారాయణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలోని మైలవరం మండలంలో చేనేతల ఆశాకిరణం, కలల స్వప్నం అయిన టెక్స్‌టైల్ పార్కు ప్రారంభమెప్పుడా అని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ ప్రశ్నించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ ప్రారంభానికి నోచుకోక శిధిలావస్థలో ఉన్న భవనాలు వెక్కిరిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా టెక్స్‌టైల్స్ పార్కు భవిష్యత్ మారడంలేదన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. 2006లో ప్రారంభమైన టెక్స్‌టైల్ పార్కు నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలో 2009లో నిర్మాణం పూర్తయిందన్నారు. పార్కు ప్రారంభమైతే వేల చేనేతల కుటుంబాలకు జీవనోపాధి, వ్యాపార సంవృద్ధి లభిస్తుందన్నారు. ఎన్నికల్లో చేనేతల ఓట్లు కావాలి కానీ వారి పార్కు మాత్రం ఏర్పాటు చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ ఆశయాలు కొనసాగిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ తన తండ్రి వేసిన పునాది టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. చేనేతలకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే రాబోవు ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మీనారాయణ, శివశంకర్ పాల్గొన్నారు.

కుంగిన రోడ్లు.. ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న రోడ్లు కుంగిపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కారణంగా వేంపల్లె గ్రామంలోని రోడ్లన్నీ చిందరవందరగా మారాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేసే కాంట్రాక్టర్లు ఒక ప్రణాళికతో పనులు చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వీధిలో కాంట్రాక్టర్లు గుంతలు తీసి నామ మాత్రంగా మట్టితో కప్పేశారు. ఈ పరిస్థితుల్లో వీధుల్లో రోడ్లు అన్ని గుంతలుగా ఏర్పడి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు గండి రోడ్డులో ఉన్న విశ్వనాథరెడ్డి మిషన్ వీధి, శ్లోక పాఠశాలకు వెళ్లే రోడ్లు కుంగిపోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల రోడ్లు కుంగిపోవడంతో ప్రజలు నడవలేని స్థితి ఏర్పడింది. పనులు జరిగే సమయంలో అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా ఉండడంతో ఇలా దెబ్బ తిన్నట్లు ప్రజలు వాపోతున్నారు. పులివెందుల రోడ్డులో కూడా అస్తవ్యస్తంగా రోడ్డు ఉంది. ఆ రహదారిలో వెళ్లే వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్డులో కూడా పనులు చేసే కాంట్రాక్టర్లు తవ్విన మట్టిని అక్కడే వదలి వేయడంతో ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. ఏ రోడ్డులో వెళ్లాలన్న రోడ్లన్నీ బురదమయం. బురద మట్టిలో వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారు. ప్రజలు పడుతున్న కష్టాలను ప్రజాప్రతినిధులు, అధికారులు చూస్తూకూడా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు కూడా పెదవివిరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు జరిగే సమయంలో పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



విశ్వనాథరెడ్డి మిషన్ వీధిలో కుంగిన రోడ్డు

వర్షపు నీరు తొలగించాలని సిపిఎం నిరసన



రోడ్డుపై వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణంలోని వనిపెంట రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలో రోడ్డుపై నిలుస్తున్న వర్షపు నీటిని తొలగించాలని సిపిఎం మైదుకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గండి సునీల్‌కుమార్, షరీఫ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తూ ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోనే ప్రధాన రహదారిపై పరిస్థితి ఇలా ఉంటే పేదల కాలనీల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారాలు నిర్వహిస్తూ అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యను గుర్తించి వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వర్షపు నీటిలో వరినాట్లు వేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, భీమయ్య పాల్గొన్నారు.

దేవర సిరిబండి రస్తా విషయంలో అపోహలు వద్దు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో దేవర సిరిబండి రస్తా విషయంలో అధికారులు, నాయకులు మాట్లాడి రహదారికి సంబంధించి ఒక కొలిక్కి తీసుకొచ్చామని, అది తెలుసుకోకుండా టిడిపి నాయకులు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి రాద్ధాంతం చేయడం సబబు కాదని పట్టణ బలిజ సంఘ పెద్దలు వెంకటసుబ్బయ్య, పులివెందుల పట్టణ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, సాయి, ఆంజనేయులు, సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బలిజ సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గాడిచర్ల వంశీయులు పాత సంత మార్కెట్ వితరణగా ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. జనాభా పెరగడంతో పులివెందుల రూపురేఖలు మార్చాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడ ఉన్న కూరగాయల మార్కెట్‌ను ఊరి బయటకు మార్చారన్నారు. గతంలో వారపు సంత ఇరుకుగా ఉండడంతో ఇక్కడ నుండి అక్కడికి మార్చడం.. ఇక్కడ పదిమంది బతికేందుకు కాంప్లెక్స్ నిర్మించడం జరిగిందన్నారు. పులివెందుల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా, నూతన కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారని దీనికి సంబంధించి దేవర సిరిబండి వెళ్లేందుకు మార్గం ఎత్తుగా వస్తుండడంతో ఈ విషయాన్ని ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇటీవల కలెక్టర్, వైయస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో దేవర సిరిబండి రోడ్డుకు సంబంధించి ట్రయల్ రన్ చేశారన్నారు. అప్పుడు ఆ మార్గం కొంత ఇబ్బంది కలిగింది వాస్తవమేనని, వెంటనే కలెక్టర్ మార్గానికి సంబంధించి ఇబ్బంది ఉంటే వెంటనే సరి చేయాలని అధికారులకు సూచించారన్నారు.



మాట్లాడుతున్న సంఘ పెద్దలు, అధ్యక్షులు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రమణమ్మ

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకమని డిప్యూటీ డెమో రమణమ్మ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని బాకరాపురం పట్టణ హెల్త్ సెంటర్‌లో ఆశా డే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశాలకు గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ పరీక్షల వ్యతిరేక చట్టం మీద అవగాహన కల్పించారు. ఈ ఈసందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరిగితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటారని తెలిపారు. లింగ నిర్ధారణ చేసుకొని ఆడపిల్ల అని తెలిపితే.. వారికి రూ.10వేలు జరినామా, మూడేళ్ల జైలు, రెండవ సారి తెలిపితే రూ.50 వేలు జరినామా, అయిదేళ్ల జైలు, చెప్పిన వారి సర్టిఫికెట్ రద్దు చేస్తారన్నారు. సమావేశంలో ఎంపిహెచ్ఈ ఒ.సతీష్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, లెప్రసీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో నేరాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం నేరాంధ్రప్రదేశ్‌గా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. నూతనంగా నియామకమైన జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు రాజేష్, జమ్మలమడుగు మండలశాఖ అధ్యక్షుడు పుష్పరాజ్ స్థానికంగా మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం 2022 ఏడాదిలో మహిళలపై జరిగిన నేరాల్లో దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం ఉండడం దురదృష్టకరమన్నారు. దళితులపై జరిగిన నేరాల్లో దక్షిణాది రాష్ట్రాల్లో ఎపి ప్రథమ స్థానంలో ఉందన్నారు. జగన్ పాలనలో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు పెరిగాయని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి అని పార్లమెంటులో కేంద్ర పట్టణాబివృద్ధి శాఖ సహాయ మంత్రి కౌశల్ కుమార్ రాతపూర్వకంగా పేర్కొనడాన్ని హర్షిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసే 6 సూత్రాల కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు జానకీరామ్, బ్రహ్మానందరెడ్డి, ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పంచాయతీల పరిస్థితి అత్యంత దారుణం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో పంచాయతీల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలు ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. సిఎం జగన్ గ్రామీణ ప్రజలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. సర్పంచులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అప్పులు చేసి వసతులు కల్పిస్తే బిల్లులు రాక, ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. సర్పంచుల విధులు, నిధులను ప్రభుత్వం లాగేసుకుందన్నారు. సర్పంచ్ కంటే వాలంటీర్‌కు ఉన్న పవర్ ఎక్కువన్నారు. సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు సర్పంచ్‌ల ఆధీనంలో పని చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ చట్టం-2006 ప్రకారం నిధులను పంచాయతీలకు అప్పజెప్పాలన్నారు. పాము తన పిల్లలను తానే చంపినట్లు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి, గుర్రప్ప యాదవ్, తప్ప మహబూబాషా, సిద్దయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

5న ఓటర్ల తుది జాబితా : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జనవరి 5న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో మంగళవారం ఆయన రాజకీయ ప్రతినిధులతో ఓటర్ జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు ఓటరు జాబితాలో చేర్చిన వాటిని జనవరి 5న ముద్రించి జాబితాను రాజకీయ ప్రతినిధులకు అందిస్తామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఓటరు నమోదు ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి విత్ డ్రా చేసుకునే వరకు ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, అయితే తొలగించడానికి అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురప్ప, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ షఫీ, సీనియర్ ఎన్నికల అధికారులు మస్తాన్‌వలి, ముద్రా వివేకానందరెడ్డి, రాజకీయ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, పోచిరెడ్డి, గంగాధర్, చౌడేశ్వర్, సీతారాముడు, మద్రి ప్రకాశం పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. స్థానిక వేంపల్లి రోడ్‌లోని 5వ సచివాలయంలో మంగళవారం ఆయన సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలో ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణం పూర్తిచేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ రామకీష్ణ, నోడల్ అధికారి దాశరథి, 5వ సచివాలయ అడ్మిన్ శ్రీలత, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సిలో మండలవాసికి ఉద్యోగం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



ఉదయ్‌కుమార్‌రెడ్డి

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నిర్వహించిన పరీక్షల్లో చింతలజుటూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి మొదటి ప్రయత్నంలోనే అత్యున్నత ఉద్యోగాన్ని పొందాడు. చింతల జూటూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి బాల గంగిరెడ్డి తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్‌గా పనిచేస్తుండగా.. ఆయన కుమారుడైన ఉదయ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటూ 2022-2023 సంవత్సరానికి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైనైడ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే కస్టమ్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందారు. సొంత గ్రామమైన చింతల జూటూరులో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి : ఎఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

నేలను కాపాడుకునేందుకు సేంద్రియ ఎరువులను వాడాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని బొందలకుంట ఆర్‌బికెలో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైరుల వాడకం పెంచి, పశువుల ఎరువు వాడే దిశగా రైతులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజహత్, వెంకట రామిరెడ్డి, రామసుధ, రామ భూపాలుడు, రైతులు పాల్గొన్నారు.